
సాక్షి రంగారెడ్డి
శుక్రవారం, 26, మే, 2023



చామంతి సాగుకు వేళాయె..
నల్లరేగడి, బరక నేలలు అనుకూలంగా ఉండటంతో రైతులు చామంతి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. 8లో▸

నేడు బ్యాంకు రుణాలపై అవగాహన
కడ్తాల్: మండల కేంద్రంలోని ఎంజీపీ గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయ డెయిరీ పాడి రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు స్థానిక పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధిక గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు బ్యాంకు అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

రేపు 'వంగూరి వాచకం' పుస్తకావిష్కరణ
షాద్‌నగర్: విశ్రాంత ఉపాధ్యాయుడు వంగూరి గంగిరెడ్డి రచించిన వంగూరి వాచకం పుస్తకావిష్కరణ శనివారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సాహితీ కళా భారతి సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విచ్చేస్తున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

త్వరలో వాహనాల వేలం



సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అబాండెడ్, అన్‌క్లెయిమ్డ్ వాహనాలకు సంబంధించి ఇప్పటి వరకు పది దశల్లో వేలం వేసినట్లు గురువారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. మొత్తం 9,627 వాహనాల ఆక్షన్ నిర్వహించామన్నారు. వీటి వేలంతో రూ.6 కోట్ల వరకు సమీకరించినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 4,702 అబాండెడ్, అన్‌క్లెయిమ్డ్ వాహనాలకి సంబంధించి 8 ప్రొక్లెమేషన్ నోటీసులను సైతం రిలీజ్ చేశామన్నారు. రానున్న రోజుల్లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఇలాంటివి సుమారు 6 వేలకు పైగా వాహనాలు ఉన్నాయని, వాటికీ నోటీసులు ఇచ్చామన్నారు. త్వరలో వాటిని కూడా వేలం వేస్తామని సీపీ తెలిపారు. వాహనాలకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అభ్యంతరాలు ఉన్న యజమానులు ఆరు నెలల కాల పరిమితిలోపు వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లతో సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఓయూ ఇంజినీరింగ్ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ వివిధ విభాగాల ఫైనలియర్ కోర్సుల ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ నెల 16న ప్రారంభమై 20న ముగిసిన పరీక్ష ఫలితాలను రికార్డు స్థాయిలో ఐదు రోజుల్లో విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్ తెలిపారు. సివిల్ 98.44 శాతం, మెకానికల్ 100, ఎలక్ట్రికల్ 100, ఎలక్ట్రానిక్స్ 98.11, కంప్యూటర్ సైన్స్ 100, బయోమెడికల్ ఇంజినీరింగ్ కోర్సులో 100 శాతం మంది విద్యార్థులు పాస్‌కాగా మొత్తం 99.46 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డబ్ల్యూవై-231 విమానంలో మస్కట్ నుంచి గురువారం ఉదయం వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. క్యాప్సుల్స్‌లో పేస్టురూపంలో ఉన్న బంగారాన్ని మలద్వారంలో పెట్టుకుని తీసుకొచ్చినట్లు గుర్తించారు. 685.75 గ్రాముల బంగారం విలువ రూ.42.78 లక్షల ఉంటుందని నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు పోరాటం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ



మాట్లాడుతున్న గోవిందు నరేష్ మాదిగ

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేంత వరకు పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ స్పష్టం చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో గురువారం సంఘం జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. జనాభా ప్రాతిపదికన మాదిగలు, మాదిగ ఉపకులాలకు 12శాతం విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జూలైలో లక్షలాది మందితో 'చలో హైదరాబాద్' నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మద్దిలేటి, శంకర్‌రావు, రత్నం, అనంతయ్య, శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్, బొబ్బిలి పాండు, అశోక్, నాగభూషణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదెకరాలుంటేనే..



హెచ్ఎండీఏలో లే అవుట్‌కు ఎకరమే..
- 111 జీఓ పరిధిలో ఐదు ఉండాల్సిందే
- భవన నిర్మాణ నిబంధనల్లో సవరణలకు కమిటీ నిర్ణయం
- నివాసాలు, వినోద కేంద్రాల నిర్మాణాలకే అనుమతులు
- భారీ వాణిజ్య సముదాయాలు, కాలుష్య పరిశ్రమలకు నో పర్మిషన్

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను పరిరక్షించడంతో పాటు 111 జీఓ పరిధిలోని 84 గ్రామాల్లో కాంక్రీట్ జంగిల్‌గా అస్తవ్యస్తంగా కాకుండా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారుల కమిటీ కొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనతో పాటు భవన నిర్మాణ నిబంధనల్లో పలు సవరణలు చేయాలని భావిస్తోంది. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ), బఫర్ జోన్‌లు, గ్రీన్ బెల్ట్‌లు, వంద అడుగుల వెడల్పాటి అప్రోచ్ రోడ్లు, భూ వినియోగం, పార్కింగ్ వంటి పలు కఠినతర నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించింది.

నిబంధనల్లో సవరణలు?
ఆ 84 గ్రామాల్లో కొన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తున్నప్పటికీ.. 111 జీఓ గ్రామాలన్నింటికీ హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) భవన నిర్మాణ నిబంధనలే వర్తిస్తాయని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏ పరిధిలో లే- అవుట్ అనుమతులు జారీ చేయాలంటే కనీసం ఎకరం విస్తీర్ణం ఉండాల్సిందే. కానీ.. 111 జీఓ పరిధిలో మాత్రం చిన్నాచితకా వాటికి కాకుండా కనిష్టంగా ఐదెకరాలు, అంతకుమించి ఉండే స్థలాలకు మాత్రమే లేఅవుట్ పర్మిషన్లు మంజూరు చేయాలని హెచ్ఎండీఏ అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు భవన నిర్మాణ నిబంధనల్లో సవరణలు చేయాలని ఉన్నతాధికారుల కమిటీ నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. కొత్తగా రూపుదిద్దుకుంటున్న మాస్టర్ ప్లాన్‌లో ఈ కొత్త నిబంధనలను పొందుపరచనున్నారు. రోడ్ల వెడల్పు, లే-అవుట్ విస్తీర్ణం, భూ వినియోగం, పార్కింగ్ నిబంధనలు తదితర అంశాల్లో మున్సిపాలిటీలతో పోలిస్తే హెచ్ఎండీఏ నిబంధనలు చాలా కఠినతరంగా ఉండనున్నాయని ఓ అధికారి తెలిపారు.

వంద ఎకరాలకు మించితే..
111 జీఓ పరిధిలో నివాస సముదాయాలతో పాటు వినోద కేంద్రాల నిర్మాణాలకు అనుమతి ఉంటుంది. 100 ఎకరాలు, 20 వేల చదరపు అడుగులకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉండే నిర్మాణాలకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి చేయాలని కమిటీ నిర్ణయించింది. అంతేకాకుండా నీటి వనరులకు 100 మీటర్లు, నాలాకు 50 మీటర్ల దూరంలో ఉంటే నీటి పారుదల, రెవెన్యూ శాఖల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) తప్పనిసరి అని అధికారులు తెలిపారు.

వీటికి అనుమతులు లేవు..
జంట జలాశయాలు కాలుష్యం ప్రధాన ఆందోళనగా ఉన్న నేపథ్యంలో మూసీ పొడవునా, రెండు రిజర్వాయర్ల చుట్టూ మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ)లను నిర్మించనున్నారు. నది సరిహద్దు నుంచి 50 మీటర్ల వరకూ ఏ తరహా నిర్మాణాలకు అనుమతి లేదు. భారీ వాణిజ్య సముదాయాలు, కాలుష్యాన్ని వెదజల్లే పారిశ్రామిక నిర్మాణాలకు అనుమతులు ఉండవని ఓ ఉన్నతాధికారి స్పష్టం చేశారు. పూర్తి చెరువు సామర్థ్యం (ఎఫ్‌టీఎల్), లేక్ బెడ్స్, 500 మీటర్ల వరకు బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతినివ్వరు.



హైదరాబాద్‌లో గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరీశ్

సమీకృత మార్కెట్ త్వరగా పూర్తి చేయాలి

- మంత్రి సబితారెడ్డి



తుక్కుగూడలో మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సూచించారు. తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలోని వార సంత ప్రదేశంలో చేపడుతున్న సమీకృత మార్కెట్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెజ్, నాన్‌వెజ్ వ్యాపార సముదా యాలు ప్రజలకు అందుబాటులో ఒకే ప్రదేశంలో ఉండేలా ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్లను మంజూరు చేసిందని అన్నారు. రూ.4 కోట్లకుపైగా ఖర్చు చేసి ఈ మార్కెట్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీంతో చిరు వ్యాపారులకు ఉపాధితో పాటు ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులు పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, కౌన్సిలర్ రవినాయక్, నాయకులు సప్పిడి రాజు, బూడిద శ్రీకాంత్, ముప్పిడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అనురాధ కేసు.. 'అక్యూజ్డ్ టు డిసీజ్డ్'!



- ఈ కోణంలో ముందుకు వెళ్లకే అనేక కేసులు క్లోజ్
- ఏళ్లుగా కొలిక్కి చేరని అతి దారుణ హత్యలు ఎన్నో
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు బి.చంద్రమోహన్

సాక్షి,సిటీబ్యూరో: రాజధానిలోని బహిరంగ ప్రదేశాల్లో లభించిన గుర్తుతెలియని మృతదేహాలకు సంబంధించిన హత్య కేసుల్లో మూసీ ఒడ్డున దొరికిన మాజీ హెడ్-నర్సు వై.అనురాధదీ ఒకటి. ఈ కేసును మలక్‌పేట పోలీసులు రొటీన్‌కు భిన్నంగా దర్యాప్తు చేశారు. సుదీర్ఘమైన ఈ ప్రక్రియను చాలా వేగవంతంగా పూర్తి చేశారు. సీన్ కట్ చేస్తే... ఈమె తల లభించిన పది రోజుల్లోనే నిందితుడైన బి.చంద్రమోహన్‌ను అరెస్టు చేసి హతురాలిని గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో అధికారులు 'అక్యూజ్డ్ టు డిసీజ్డ్' విధానం అవలంబించారు.

సాధారణంగా మూస ధోరణే...
నగరంలోని వివిధ ప్రాంతాల్లో తరచూ గుర్తుతెలియని మృతదేహాలు లభిస్తూనే ఉంటున్నాయి. కొన్నింటిని హత్యలుగా నిర్ధారిస్తున్న పోలీసులు ఆ మేరకు కేసులు నమోదు చేస్తున్నారు. దర్యాప్తులో మాత్రం మూస ధోరణి వ్యవహరిస్తున్నారు. సాంకేతికంగా హత్య కేసుల్లో నిందితులను అక్యూజ్డ్ అని, హతులను డిసీజ్డ్ అని సంబోధిస్తారు. ప్రతి కేసులోనూ దర్యాప్తు అధికారులు తొలుత హతులను గుర్తించడంపైనే దృష్టి పెడుతున్నారు. వీళ్లు ఎవరన్నది తెలిస్తే పూర్వాపరాలు, గత చరిత్ర తదితరాలను అధ్యయనం చేస్తే నిందితులు తేలిగ్గా దొరుకుతారన్నది అధికారుల భావన. ఈ కారణంగానే 'గోల్డెన్ టైమ్'గా పిలిచే కేసు నమోదైన తొలి నాళ్లలో హతులపైనే దృష్టి పెడుతున్నారు. ఈ విధానం అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే ఫలితాలు ఇస్తోంది. అనేక కేసుల్లో హతులు, హంతకులు తెలియక పెండింగ్‌లో ఉండిపోవడం, క్లోజ్ కావడం అవుతోంది.

ఆ ప్రయత్నం ఫలించకపోవడంతో..
గుర్తుతెలియని మహిళ హత్యగా నమోదైన అనురాధ కేసు దర్యాప్తు ప్రారంభించిన మలక్‌పేట అధికారులు తొలుత 'డిసీజ్డ్ టు అక్యూజ్డ్' విధానాన్నే అవలంబించారు. రాజధానిలోని మూడు పోలీసు కమిషనరేట్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 735 పోలీసుస్టేషన్ల నుంచి నమోదవుతున్న మిస్సింగ్ కేసుల వివరాలు ప్రతి పూటా సేకరించారు. దర్పణ్ యాప్ ద్వారా ఆచూకీ కోసం ప్రయత్నించారు. సీఐడీ, ఉమెన్ సేఫ్టీ వింగ్, స్టేట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలను సంప్రదించి హతురాలి వివరాలు ఆరా తీశారు. ఆమె ఫొటోతో పోస్టర్లు ముద్రించి మలక్‌పేట చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు అనేక చోట్ల వాటిని ఉంచి ప్రయత్నాలు చేశారు. ఇవేవీ ఫలితం ఇవ్వకపోవడంతో మేల్కొన్న అధికారులు తమ పంథా మారుస్తూ 'అక్యూజ్డ్ టు డిసీజ్డ్' విధానంలోకి మారారు.

ఎనిమిది రోజుల ఫుటేజ్ అధ్యయనం..
- తొలుత నిందితుడిని గుర్తించడంపై దృష్టి పెట్టి సీసీ కెమెరాల్లోని ఫీడ్ సేకరించారు. తల దొరికిన ప్రాంతానికి అటు ఇటు 300 మీటర్ల పరిధిలో ఉన్న కెమెరాలను ఎంచుకున్నారు. ఈ నెల 10 నుంచి 17 వరకు వాటిలో రికార్డు అయిన ఫీడ్ మొత్తం పరిశీలించారు. ఇలా మొత్తం 54 అనుమానిత వాహనాలను గుర్తించారు. వీటిలో ఏదో ఒకటి నిందితుడు వాడి ఉంటాడని ముందుకు వెళ్లి చంద్రమోహన్‌ను పట్టుకున్నారు.
- మలక్‌పేట పోలీసులు బుధవారం అరెస్టు అయిన నిందితుడు బి.చంద్రమోహన్‌ను మలక్‌పేట పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచి, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. ఈ కేసులో పూర్తి సాక్ష్యాధారాలు సేకరించడానికి, హత్య పూర్తి కారణాలు నిర్ధారించడానికి నిందితుడిని లోతుగా విచారించాలని అధికారులు నిర్ణయించారు. దీనికోసం పది రోజుల పోలీసు కస్టడీకి అనుమతివ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

సముచిత స్థానం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

- బీసీలకు గొర్రెలు, బర్రెలు కాదు అసెంబ్లీ సీట్లు కేటాయించండి
- అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో 50 శాతం ప్రకటించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

చేవెళ్ల: రాష్ట్రంలోని బీసీలకు గొర్రెలు, బర్రెలు ఇవ్వడం కాదని అసెంబ్లీలో జనాభా ప్రకారం సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మండలకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సింలుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 75 ఏళ్లుగా బీసీ కులాల ఓట్లు వేసుకొని పెత్తనం చేస్తున్నారని.. అవకాశాలు, అధికారం మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. ఇంకా ఎన్నాళ్లు ఇలా మోసం చేస్తారని ప్రశ్నించారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో బీసీలకు 50 శాతం ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏ పార్టీ అయితే అలా కేటాయిస్తుందో వారికే బీసీల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు బీసీలకు రుణాలు ఇస్తామని చెప్పి 5.70 లక్షల దరఖాస్తులు తీసుకున్నారని ఒక్కరికి కూడా ఇవ్వలేన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చాయని కొన్ని కులాలకు రూ.లక్ష రుణాలు ఇస్తామని చెబుతున్నారని విమర్శించారు. బీసీబంధు పథకం తేవాలన్నారు. రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని, రూ.కోట్లలో ఆస్తులు సంపాదించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఏపీలో వైఎస్సార్‌సీపీ బీసీలకు సుముచిత న్యాయం చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు మనోహర్, శ్రీకాంత్, రాఘవేందర్, శంకాగౌడ్, ప్రవీణ్, శ్రీశైలం, వీరేశ్ పాల్గొన్నారు.

గ్రేటర్‌లో రూట్‌పాస్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ 'జనరల్ రూట్ పాస్'ను ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే టి-24, టి-6, ఎఫ్-24 వంటి టికెట్లతో ప్రయాణికులకు ప్రత్యేక రాయితీలను కల్పిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తక్కువ దూరం ప్రయాణించే వారి కోసం ఈ రూట్ పాస్‌కు రూపకల్పన చేశారు. కేవలం 8 కిలోమీటర్ల పరిధిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు దీనిని వినియోగించుకోవచ్చు. ఈ నెల 27 నుంచి రూట్ పాస్ అందుబాటులోకి రానుంది. నెల రోజుల పాటు వర్తించే సిటీ ఆర్డినరీ రూట్ బస్ పాస్‌కు రూ.600, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూట్ పాస్‌కు రూ.1000 చొప్పున ధర నిర్ణయించారు. దీంతో పాటు ఐడీ కార్డుకు రూ.50 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. మొదట నగరంలోని 162 రూట్లలో ఈ సదుపాయాన్ని ప్రారంభించనున్నారు. రూట్ పాస్ వినియోగదారులు 8 కిలోమీటర్ల పరిధిలో అపరిమితంగా ఎన్నిసార్లయినా బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఆదివారాలు, ఇతర సెలువు రోజుల్లోనూ ప్రయాణించవచ్చు.

ప్రారంభ ఆఫర్..
సాధారణంగా ఆర్డినరీ రూట్ పాస్‌కు రూ.800, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూట్ పాస్‌కు రూ.1200 ఉంది. కొత్తగా ప్రారంభిస్తున్న దృష్ట్యా రూ.200 రాయితీని కల్పించి.. సిటీ ఆర్డినరీ రూట్ బస్ పాస్‌ను రూ.600, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూట్ పాస్ రూ.1000కే అందిస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. గ్రేటర్‌లో ప్రస్తుతం 1.30 లక్షల జనరల్ మెట్రో, 40 వేల ఆర్డినరీ పాస్‌లు ఉన్నాయి. రూట్‌పాస్‌లను కూడా ప్రయాణికులు ఆదరించాలని ఆయన కోరారు. రూట్‌ల వివరాలను ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

పైసా వసూల్!

- అనుమతులు లేని వెంచర్లకు కరెంట్ మంజూరు
- నిబంధనలు పాటించని నిర్మాణాలకు ట్రాన్స్‌ఫార్మర్లు
- అడిగినంత అప్పజెబితే అనుమతులు
- ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు



కందుకూరు డివిజన్‌లోని వివాదాస్పద వక్ఫ్ భూమి ఇది. ఈ వెంచర్‌కు ఇటు డీటీసీపీ నుంచి కానీ, అటు హెచ్ఎండీఏ నుంచి కానీ ఎలాంటి అనుమతులు రాలేదు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఇంజనీర్లు లైన్లు సహా, ట్రాన్స్‌ఫార్మర్ ఎలా మంజూరు చేశారనేదీ? అంతు చిక్కడం లేదు.



శంషాబాద్ సమీపంలో 111 జీఓ పరిధిలో వెలిసిన భారీ బహుళ అంతస్తుల భవనం ఇది. దీనికి స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కానీ ఇంజనీర్లు ట్రాన్స్‌ఫార్మర్ ఎలా జారీ చేశారనే దీ ప్రశ్నార్థకంగా మారింది'

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని మెజార్టీ డివిజన్లలో పని చేస్తున్న ఇంజనీర్లు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటుకు, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి, అక్రమ నిర్మాణాలకు కారణమవుతున్నారు. గచ్చిబౌలి, కొండాపూర్, ఇబ్రహీంబాగ్, కందుకూరు, చంపాపేట్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, షాద్‌నగర్ డివిజన్ల పరిధిలో ఈ అక్రమాల తంతు ఎక్కువగా కొనసాగుతోంది. అడినంత ముట్టజెబితే చాలు కళ్లు మూసు కుని ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, ప్యానల్ బోర్డులు, మీటర్లు మంజూరు చేస్తున్నారు. ఇచ్చేందుకు నిరాకరించిన వారికి చుక్కలు చూపిస్తున్నారు. ఇంజనీర్ల తీరుపై విసిగిపోయిన కొంతమంది ఏసీబీ అధికారులను ఆశ్రయించి, రెడ్ హ్యాండెడ్‌గా పట్టిస్తున్నారు. ప్రతి నెలా ఒకరో ఇద్దరో ఇలా పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా మొయినాబాద్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో వెలసిన నిర్మాణానికి మీటర్ మంజూరు చేసే విషయంలోనూ ఓ లైన్‌మన్ ఏసీబీకి పట్టుబడ్డాడు. గతంలో ఇదే సర్కిల్‌లో అవినీతి ఆరోపణలపై ఏఈ సహా ఇద్దరు లైన్‌మన్లు సస్పెండయ్యారు. అయినా మార్పు రావడం లేదు. ఏసీబీ కేసుల్లో అరెస్టయినవారు ఆ తర్వాత అంతకంటే మంచి పోస్టులో చేరి తిరిగి వసూళ్ల దందా మొదలు పెడుతున్నారు.

అనుమతులు లేకున్నా..
అబ్దుల్లాపూర్‌మెట్, కుంట్లూరు, హయత్‌నగర్ ఆర్టీసీ కాలనీ, మునుగనూరు, లెనిన్‌నగర్, సీతారాంపేట్, ఆదిబట్ల, యాచారం, తుర్కయంజాల్, బడంగ్‌పేట, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, మొయినాబాద్, అజీజ్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, ఇంద్రారెడ్డినగర్‌లోని ప్రభుత్వ భూముల్లో ఇటీవల అనేక అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వీటికి ఎలాంటి అనుమతులు లేకున్నా ఆయా తాత్కాలిక నిర్మాణాలన్నింటికీ విద్యుత్ శాఖ మీటర్లు జారీ చేయడం విశేషం. క్షేత్రస్థాయిలోని ఆర్టిజన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, ఏడీఈలు చేతివాటం ప్రదర్శించారు. ఒక్కో కనెక్షన్ నుంచి రూ.20 వేలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది.

పోస్టింగ్‌ల కోసం పోటీ..
శంషాబాద్, గండిపేట, మణికొండ, రాజేంద్రనగర్, మొయినాబాద్, శంకర్‌పల్లి, కొత్తూరు మండలాల్లో సుమారు 80 గ్రామాలు 111 జీఓ పరిధిలో ఉన్నాయి. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ సమీపంలో ఈ ప్రాంతం ఉండటంతో ప్రస్తుతం అనేక బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. అనేక మంది నిర్మాణదారులు ఇప్పటికీ పాత పంచాయతీ, సీఈఐజీల నుంచి ఎన్‌ఓసీలు సృష్టిస్తున్నారు. ఆయా నకిలీ రసీదులతో మీటర్లు, లైన్లు, ప్యానల్ బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్లకు దరఖాస్తు చేస్తున్నారు. ఇక్కడ ఏళ్లుగా ఈ దందా కొనసాగుతూనే ఉంది. ఇక్కడి నిర్మాణాలు ఇంజనీర్లకు కాసుల వర్షం కురిపిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో పోస్టింగ్‌ల కోసం రూ.20 లక్షలపైనే ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కాళ్లా వేళ్లా పడినా..
ఎంవీఎస్ఆర్ కాలేజీ సమీపంలో కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నాను. ఐదు నెలల క్రితం మీటర్ కోసం దరఖాస్తు చేస్తే జారీ చేశారు. అప్పట్లోనే రూ.20 వేలు చెల్లించా. ప్రతి నెలా బిల్లు కడుతూనే ఉన్నా. తీరా గృహ ప్రవేశానికి ముందు లైన్‌ఇన్‌స్పెక్టర్ వచ్చి వెంచర్‌లో స్తంభాలకు అనుమతి లేదని చెప్పి కరెంట్ కట్ చేశాడు. కాళ్లావేళ్లా పడినా కనికరించలేదు.
– జయరాం, నాదర్‌గుల్

అడిగిన మొత్తం ఇచ్చి..
ఇటీవల త్రీఫేజ్ మీటర్ కోసం దరఖాస్తు చేశాను. ఎంక్వైరీకి వచ్చిన లైన్‌ఇన్‌స్పెక్టర్ ఇంట్లో ప్లగ్గులు, స్విచ్ బోర్డులు ఎక్కువ ఉన్నాయని చెప్పి.. మీటర్ జారీలో తాత్సారం చేశాడు. మీటర్ కావాలంటే ఆఫీసులో కొంత చెల్లించాల్సి ఉందని చెప్పాడు. చేసేది లేక అడిగిన మొత్తాన్ని చేతికిచ్చి పంపాల్సి వచ్చింది.
– రాజశేఖర్, బడంగ్‌పేట

ఏసీబీకి ఫిర్యాదు
బాకారంలోని ఓ ఫాంహౌస్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నా. మేం ఉండేందుకు యజమాని అక్కడ రెండు గదులు నిర్మించాడు. కరెంట్ మీటర్ కోసం దరఖాస్తు చేశారు. జూనియర్ లైన్‌మన్ రూ.15 వేలు డిమాండ్ చేస్తే.. ఇప్పటికే రూ.10 వేలు ఇచ్చాను. మరో రూ.5 వేల కోసం ఒత్తిడి చేయడంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాను.
– ప్రతాప్, మొయినాబాద్

పనిచేస్తున్న కంపెనీలోనే కార్మికుడి ఆత్మహత్య

యాచారం: మనస్తాపానికి గురైన ఓ కార్మికుడు విధులు నిర్వర్తించే కంపెనీలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్‌సింగ్ (32) కొన్నేళ్లుగా తాడిపర్తి గ్రామంలోని ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రెండు,మూడు రోజులుగా దిగాలుగా ఉన్న అర్జున్‌సింగ్ తీవ్ర మనస్తాపంతో బుధవారం విధులు నిర్వర్తించే కంపెనీ భవనంలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న యాచారం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

చేను ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా..

విద్యుదాఘాతంతో రైతు మృతి


యాదయ్య మృతదేహం

ఇబ్రహీంపట్నం: చేనులో పందులు పడకుండా చుట్టూ ఫెన్సింగ్ వేసి వాటికి విద్యుత్ సరఫరా పెట్టగా...ఆ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో గురువారం ఉదయం వెలుగు చూసింది. స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కప్పపహాడ్‌కు చెందిన బి.నరేష్.. అడవి పందులు పడి పంట ధ్వంసం చేయకుండా తన వరిచేను చుట్టూ బైండింగ్ వైర్ వేసి దానికి విద్యుత్ సరఫరా పెట్టాడు. ఈ విషయం తెలియని సమీప వ్యవసాయ క్షేత్రానికి చెందిన నిట్టు యాదయ్య (53) బుధవారం సాయంత్రం ఈ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డారు. ఆ మరుసటి రోజు ఉదయం విద్యుత్ షాక్‌తో గురైన యాదయ్య మృతదేహాన్ని గమనించారు. వెంటనే స్థానిక పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


చామంతి పూలతోట


జర్మన్ చామంతి పూలతోట

చామంతి సాగుకు వేళాయె..

- జూన్, జూలైలో మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- ఎకరా విస్తీర్ణంలో రూ.60వేల వరకు పెట్టుబడి
- కార్తీకమాసం నాటికి దిగుబడి

షాబాద్: చామంతి పూలసాగుకు సమయం రానే వచ్చింది. పండుగలు, పెళ్లిళ్లు, పూజలకు చామంతిపూలను ఎక్కువగా వాడుతారు. దీంతో వాటికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీంతో పొలాలను సిద్ధం చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. చామంతి సాగుకు నల్లరేగడి, బరక నేలలు అనుకూలంగా ఉండటంతో వాటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. చామంతి సాగు జూన్, జూలై నెలలోనే ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా ఆరు నెలలకు దిగుబడులు వస్తాయి. ఆ సమయంలో కార్తీకమాసం సహా పండుగలు, పెళ్లిళ్లు వరుసగా వస్తుండటంతో పూలకు మంచి గిరాకీ ఉంటుంది.

షాబాద్ మండలంలో..

మండలంలోని అంతారం, రుద్రారం, సోలిపేట్, మద్దూర్, మాచన్‌పల్లి, పోలారం, పోతుగల్, చర్లగూడ, ఎల్గొండగూడ, చందనవెల్లి, తిర్మలాపూర్, అంతిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో కనీసం 50 నుంచి 70 ఎకరాల్లో చామంతిని సాగు చేస్తారు. అందులో తెలుపు, క్యారెట్, మేరిగోల్డ్, పేపర్‌వైట్, పసుపు, వంగపూత, ఎగ్‌వైట్ రకాలు ఉంటాయి. ఇక్కడి రైతులు ఆంధ్రప్రదేశ్, బెంగళూర్ తదితర ప్రాంతాల నుంచి మొక్కలను తెచ్చుకుంటారు. ఒక్కో మొక్క రకాన్ని బట్టి రూ.1 నుంచి రూ.3 వరకు పలుకుతోంది. ఎకరా విస్తీర్ణంలో చామంతి సాగుకు రూ.60వేల వరకు పెట్టుబడి అవుతుంది.

ఎకరాకు 8 టన్నుల వరకు దిగుబడి..

రెండు నెలల పాటు వారంలో రెండు కోతలు కోయవచ్చు. పంటకాలం పూర్తయ్యేలోగా ఎకరాకు దాదాపు 8 టన్నుల వరకు దిగుబడి అందుతుంది. పండుగల సమయంలో కేజీ చామంతి పూల రకాన్ని బట్టి రూ.70 నుంచి రూ.120 వరకు అమ్ముడుపోతాయని రైతులు తెలిపారు.

“మూడెకరాల్లో సాగు చేస్తా



ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది మూడెకరాల్లో చామంతిని సాగుచేద్దామని అనుకుంటున్నాం. వైట్, రెడ్, వంగపూత రకాలను సాగుచేస్తున్నాను. పెళ్లిళ్ల సీజన్‌లో చామంతికి మంచి డిమాండ్ ఉంటుంది. ముందునుంచే పూలసాగుకు పొలం సిద్ధం చేస్తున్నాం

– పర్వాతలు, రైతు, అంతిరెడ్డిగూడ

కార్తీకమాసంలో మంచి గిరాకీ



ప్రస్తుతం రెండెకరాల్లో నాలుగు రకాల చామంతి పూలు సాగు చేస్తున్నాను. దిగుబడి వచ్చే సమయానికి కార్తీకమాసం, పెళ్లిళ్లు, పండుగలు వస్తాయి. ఆ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. చామంతి పూలసాగుతో పాటు కూరగాయల సాగు కూడా చేస్తున్నాం.

– కిష్టయ్య, రైతు, లక్ష్మరావుగూడ

వ్యసనాలకు బానిసై.. చోరీల బాట

- పోలీసులకు చిక్కిన నిందితులు
- 40 గ్రాముల గంజాయి, 7 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు, ఆటో స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో, బైక్‌లు

ఇబ్రహీంపట్నం: వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న నలుగురు యువకుల ముఠాను ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ, ఎస్ఐ శేఖర్ నిందితుల వివరాలు వెల్లడించారు. మీర్‌పేట్ పరిధిలోని నందనవనంలో నివసించే ఎం గణేశ్(22), కే శరత్‌కుమార్(21), బీ సుధాకర్(22), ఆర్ వెంకటేష్‌రాథోడ్ గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. ఈ నెల 22, 23 తేదీల్లో యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లో చోరీలకు పాల్పడ్డారు. యాచారం మండలం మాల్ గ్రామంలో ఓ ఇంటిపై నిద్రిస్తున్న వ్యక్తుల నుంచి 3 సెల్‌ఫోన్లు, తక్కళ్లపల్లి పరిధిలోని నక్కగుట్ట తండాలో ఓ ఇంటి ముందున్న బైక్‌ను, ఆ పక్కనే నిద్రిస్తున్న వ్యక్తి నుంచి మొబైల్ ఫోన్‌ను దొంగిలించారు. ఇబ్రహీంపట్నంలోని సంతోష్ థియేటర్ వద్ద గల ఓ ఇంటి ముందు ఆపిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం శివార్లలోని బీడీఎల్ రోడ్డులో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు యువకులను గురువారం అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి 40 గ్రాముల గంజాయి, 7 మొబైల్ ఫోన్లు, 2 బైక్‌లు, దొంగతనాలకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. చోరీలకు పాల్పడుతున్న వ్యక్తుల్లో గణేశ్, సుధాకర్ జీహెచ్ఎంసీ వర్కర్స్ కాగా శరత్‌కుమార్ ఆటో డ్రైవర్, వెంకటేష్ రాథోడ్ విద్యార్థి అని పోలీసులు తెలిపారు.

ఇద్దరి అదృశ్యం


పవన్ (ఫైల్)

పహాడీషరీఫ్: పనిచేసే చోట వేతనం తెచ్చుకుంటానంటూ ఇంటినుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్షగూడ జండామరి తండాకు చెందిన బడావత్ భాస్కర్ మేనల్లుడు పవన్(20).. తల్లిదండ్రులు చనిపోవడంతో మామ భాస్కర్ వద్దే ఉంటూ స్థానికంగా ఉన్న సన్‌పార్క్ వెంచర్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈనెల 22న వేతనం తెచ్చుకుంటానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన పవన్ తిరిగి ఇంటికి రాలేదు. అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ విషయమై మామ భాస్కర్ పహాడీ షరీఫ్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

చేవెళ్ల పీఎస్ పరిధిలో..


రాజు (ఫైల్)

చేవెళ్ల: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... మొయినాబాద్ మండలంలోని చిన్నమంగళారం గ్రామానికి చెందిన రాజు (28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతడు చేవెళ్లలో ఉంటున్న అక్కాబావలైన సిద్ధి లావణ్య, రాముల వద్ద గత కొన్నాళ్లుగా ఉంటున్నాడు. ఈనెల 21న చేవెళ్లలోని అక్కబావ ఇంటినుంచి చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వాకబు చేసినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం అతని బావ సిద్ధిరాములు చేవెళ్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రసన్నకుమార్

శంకర్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సీఐ ప్రసన్నకుమార్ తెలిపినవివరాలు.. శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని సింగాపురం గ్రామ శివారులో నూతనంగా నిర్మాణం అవుతున్న చైతన్య స్కూల్ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తి (42) మృతదేహం కన్పించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదుహాన్ని సీఐ ప్రసన్నకుమార్, ఎస్ఐ కృష్ణ పరిశీలించారు. శవం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు.వారం రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఫరూఖ్‌నగర్ జట్టు


విజేత జట్టుతో ఎంపీపీ ఇద్రీస్, అతిథులు

షాద్‌నగర్: సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో ఫరూఖ్‌నగర్ మండల జట్టు విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో గురువారం ఫైనల్ మ్యాచ్‌లో ఫరూఖ్‌నగర్, గండిపేట జట్లు తలబడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఫరూఖ్‌నగర్ జట్టు విజయం సాధించింది. ఎంపీపీ ఖాజా ఇద్రీస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్ రాథోడ్ విజేత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, నిర్మల, అనిత, బాలయ్య, పీఈటీలు హెచ్‌క్కేల్, వరలక్ష్మి, మోనాలిస, శ్రీలత, గోపాల్‌సింగ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఏసీల బహూకరణ


ఎమ్మెల్యే యాదయ్య చేతులమీదుగా ఏసీలు అందజేస్తున్న ప్రతినిధులు

మొయినాబాద్: వేసవిలో రోగులకు ఉక్కపోత నుంచి ఉపశమనం కల్పించడానికి రాణే ఇంజన్ వాల్స్ కంపెనీ ముందుకొచ్చింది. మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న రాణే ఇంజన్ వాల్స్ కంపెనీవారు 2 ఏసీ(ఎయిర్ కండిషన్)లను బహూకరించారు. గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతులమీదుగా పీహెచ్‌సీ వైద్యాధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఏసీలు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసేందుకు దాతలు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, కంపెనీ జీఎంలు బీ.రెడ్డికుమార్, మహేశ్వరరావు, సతీష్‌కుమార్, రమణ, మల్లేశం, విశ్వనాథ్‌రెడ్డి, సత్తిబాబు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేదర కుటుంబాలను ఆదుకోవాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్


మమత, రాజుకు నగదు అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలోని మెజార్టీ మేదర కులాల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నాయని.. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర మేదర సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కోరారు. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలోని పుట్టమమత, రాజు ఇల్లు గత నెలలో అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆ కుటుంబం నిలువ నీడలేక రోడ్డుపై పడింది. వారిని ఆదుకునేందుకు మేదర సంఘం తరపున సభ్యులందరూ కలిసి గురువారం రూ.2 లక్షల ఆర్థికసహాయం అందజేశారు. జిల్లా మేదర సంఘం ఆధ్వర్యంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పేదరికంలో ఉన్న మేదర కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, యాదగిరి, మహవీర్, నాగరాజు, యాదయ్య, రవి, ప్రచార కార్యదర్శి రమాకాంత్, కోశాధికారి ఉమా, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, కనకరాజు, షాబాద్ అధ్యక్షుడు భిక్షపతి, రాజేంద్రనగర్ అధ్యక్షుడు శ్రీశైలం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓం నమఃశివాయ

- కొత్వాల్ చెరువు కట్టపై రూ.25లక్షలతో శివుడి విగ్రహ నిర్మాణం
- నేడు మంత్రి సబితారెడ్డి, ట్రస్టు ఛైర్మన్ కార్తీక్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం


కొత్వాల్ చెరువు కట్టపైన శివుడి విగ్రహం

మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలోని శివగంగ ఆలయ సమీపంలోని కొత్వాల్ చెర్వుతండా చెరువు కట్టపైన భారీ శివుడి విగ్రహం నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమైంది. ఇప్పటికే మహేశ్వరం ఆధ్యాత్మిక క్షేత్రాలు, పలు పురాతన ఆలయాలతో పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఇంద్రారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ కార్తీక్‌రెడ్డి, మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో వారి సొంత నిధులు రూ.25 లక్షలతో ఎలక్ట్రానిక్ సిటీ లోపల కొత్వాల్ చెరువు కట్టపైన సుమారు 40 అడుగుల భారీ పరమేశ్వరుడి(శివుడి) విగ్రహ నిర్మాణం చేపట్టారు. టీఎస్ఐఐసీ నుంచి రూ.1.50 కోట్ల నిధులతో చెరువు కట్ట వెడల్పుతో పాటు వాకింగ్ ట్రాక్, చెరువు సుందరీకరణ, కట్టపైన గ్రిల్స్, టైల్స్ ఏర్పాటు చేశారు. విగ్రహం పక్కనే పర్యాటకులు కూర్చోడానికి వీలుగా గుడారం(షెడ్డు) నిర్మాణం చేపట్టారు. చెరువు కట్టపైన ఆకర్షణీయమైన చెట్లు, పక్కనే రెండెకరాల విస్తీర్ణంలో ఉద్యానవనం అభివృద్ధితో పాటు కట్టపైన ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. మంత్రి సబితారెడ్డి, ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్ కార్తీక్‌రెడ్డి చేతులు మీదుగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విగ్రహాన్నిఆవిష్కరించనున్నారు. ఉదయం 11 గంటలకు శివుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తారని కొత్వాల్ చెరువు తండా సర్పంచ్ మోతీలాల్‌నాయక్, వైస్ ఎంపీపీ సునీతానాయక్ తెలిపారు. ప్రారంభోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగలరని నిర్వాహకులు కోరారు.